## బొల్లారం గ్రామపంచాయతీలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

**-అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సర్పంచ్ సందేసరి సౌజన్య మల్లికార్జున్**



**వేములవాడ /ప్రజాధివాస్ ఏప్రిల్ 14**వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సందేసరి సౌజన్య మల్లికార్జున్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి అంబేద్కర్ చేసిన కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు అందరికీ సమాన హక్కులు లభిస్తున్నాయని గుర్తు చేశారు. "చదువుకో, సంఘటితమవ్వు, పోరాడు" అన్న అంబేద్కర్ పిలుపును స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొని అంబేద్కర్‌కు అంజలి ఘటించారు.

## వేములవాడలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**- పాల్గొన్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 14** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ కేంద్రం లోని అంబేద్కర్ విగ్రహానికి ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ బాబా సాహెబ్ చూపిన మార్గంలో పయనించడం ద్వారానే సామాజిక సమానత్వం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ కౌన్సిలర్లు, అంబేద్కర్ సంఘం నాయకులు, పట్టణ ప్రజలు మరియు వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై భీమ్ నినాదాలతో నివాళులు అర్పించారు.

## ఎన్గల్ గ్రామంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

**స్వయం ఉపాధితోనే మహిళా సాధికారత: డాక్టర్ దీప**



**చెందుర్తి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 14** చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ దీప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ శోభారాణి – సుధాకర్, ఉప సర్పంచ్ మ్యాకల జలంధర్ తో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మార్తా సత్తయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు విజేందర్, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుద్రంగిలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు





**రుద్రంగి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 14**రుద్రంగి మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడా రు. భారత రాజ్యాంగ సృష్టికర్తగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. భారతీయులందరికీ స్వేచ్ఛ, సమానత్వంతో పాటు అత్యంత శక్తివంతమైన ఓటు హక్కును కల్పించిన మహనీయుడు అంబేద్కరేనని గుర్తు చేశారు.సమాజంలో అసమానతలను తొలగించి, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, మండల నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్: అంబేద్కర్ జయంతి వేడుకల్లో నివాళులర్పించిన లింగంపల్లి సర్పంచ్ సామ తిరుపతిరెడ్డి



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 14** వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సామ తిరుపతిరెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ భారతదేశానికి గర్వకారణమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన చూపిన బాటలో నడవడం మనందరి కనీస బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం, సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ నిరంతరం కొనసాగించాలని, ముఖ్యంగా చదువు ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ఆయన నమ్మారని గుర్తు చేశారు. లింగంపల్లి గ్రామంలోని యువత, విద్యార్థులు అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకుని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# యుగపురుషుడు అంబేద్కర్.. అంధకారంలో ఉదయించిన జ్ఞాన సూర్యుడు

### నేడు డాక్టర్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు




**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 14** భారతదేశ చరిత్ర గతిని మార్చిన మహోన్నత శక్తి, అణగారిన వర్గాల ఆశజ్యోతి డాక్టర్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్ జీవిత ప్రస్థానం ఒక అద్భుత స్ఫూర్తిగాథ. 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లోని మౌ గ్రామంలో జన్మించిన భీమ్ చిన్నతనం నుండే సమాజం లోని అంటరానితనం అనే చీకటి కోణాలను చూశారు. పాఠశాలలో ఒక మూలన కూర్చోబెట్టడం, తోటి విద్యార్థులతో కలవనివ్వకపోవడం వంటి అవమానాలు ఆయనలో తిరుగుబాటు కంటే కూడా విజ్ఞానం వైపు బలమైన కాంక్షను కలిగించాయి. చదువు ఒక్కటే బానిస సంకెళ్లను తెంచుతుందని నమ్మిన ఆయన, బరోడా మహారాజు శాయంతో విదేశాలకు వెళ్లి కొలంబియా విశ్వవిద్యాలయం మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి అర్థశాస్త్రం, రాజకీయ శాస్త్రం, న్యాయశాస్త్రంలో అత్యున్నత డిగ్రీలు సాధించారు. ప్రపంచం గర్వించే మేధావిగా ఎదిగిన తర్వాత కూడా తన స్వదేశంలో అట్టడుగు వర్గాల పరిస్థితి మారలేదని గ్రహించి, తన విజ్ఞానాన్ని ఆ వర్గాల విముక్తి కోసం అంకితం చేశారు.అంబేద్కర్ కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష పోరాటంలోకి దిగారు. మహద్ సత్యాగ్రహం ద్వారా చెరువు నీటిపై దళితులకు హక్కు ఉండాలని పోరాడి సామాజిక సమానత్వానికి పునాది వేశారు. ఆయన రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ పదవుల కోసం కాకుండా ప్రజల హక్కుల కోసమే సాగింది. రాజ్యాంగ పరిషత్ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు, ఆయన భారతదేశ భిన్నత్వాన్ని, ఇక్కడి సామాజిక సంక్లిష్టతలను దృష్టిలో ఉంచుకుని ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని రూపొందించారు. కులమతాలకు అతీతంగా ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థాన్ని ఇచ్చారు. రిజర్వేషన్ల ద్వారా తరతరాలుగా అణచివేయబడ్డ వర్గాలకు చట్టసభల్లో, విద్యలో, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కల్పించి వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేశారు. ఆయన కృషి కేవలం ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాలేదు, దేశ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపనకు పునాదులు వేసిన "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపే" గ్రంథం ఆయన మేధస్సుకు నిదర్శనం.కార్మికుల సంక్షేమం కోసం ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయడం, మహిళలకు ఆస్తి హక్కును కల్పించే హిందూ కోడ్ బిల్లును తీసుకురావడం వంటి చర్యలు ఆయనను ఒక గొప్ప మానవతావాదిగా నిలిపాయి. తన వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనప్పటికీ, భార్య రమాబాయి అందించిన నిశ్శబ్ద సహకారంతో ఆయన దేశ సేవలో నిమగ్నమయ్యారు. హిందూ సమాజంలోని లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో భాగంగానే చివరకు శాంతిని ప్రసాదించే బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, తన అనుచరులకు అహింసా మార్గాన్ని చూపారు. నేడు ఆయన 135వ జయంతి సందర్భంగా, భారత దేశం గర్వించే రాజ్యాంగ శిల్పిగా ఆయన అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. అంబేద్కర్ చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి, అణగారిన వర్గాల విముక్తి కోసం ఆయన పడ్డ శ్రమ ప్రతి పౌరుడి గుండెల్లో ఒక నిరంతర స్ఫూర్తిగా వెలుగుతూనే ఉంటుంది.

## డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కు ఘననివాళి అర్పించిన పెర్నపాడు స్పెషల్ ఆఫీసర్ జిపి.ఓబులేసు..

**వేముల ఏప్రిల్ 14 ప్రజాదివాస్ ఏప్రిల్ 14 :-**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా పెర్నపాడు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి స్పెషల్ ఆఫీసర్ జిపి. ఓబులేసు పూల మాల వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ జిపి. ఓబులేసు మాట్లాడుతూ.. దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన గౌరవం అని స్పెషల్ ఆఫీసర్ జిపి.ఓబులేసు అన్నారు. గ్రామంలో నీటి, వీధిలైట్లు,రోడ్ల సమస్యలు ఉంటే తమ వద్దకు తీసుకువస్తే వాటినే వెంటనే పరిష్కరిస్తానని స్పెషల్ ఆఫీసర్ జీపీ ఓబులేసు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నాగేళ్ల అంకిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీరయ్య, వ్యవసాయ అధికారి సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

